




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్








సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 300 | శనివారం 16 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## బండి భగీరథ్ కేసులో తీర్పు రిజర్వ్

**- హై కోర్టులో దక్కని ఊరట**
**- పోక్సో కేసులో ముందస్తు బెయిల్**
**- పిటిషన్‌పై రాత్రి వరకూ విచారణ**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో దాఖలైన ముందస్తు రక్షణ (బెయిల్) పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ పూర్తయింది. శుక్రవారం రాత్రి 11.45 గంటల వరకు ..ఇరుపక్షాల వాదనల అనంతరం హైకోర్టు ఈ కేసుపై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిస్థితిలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని స్పష్టం చేసింది. తదుపరి విచారణలో తుది ఉత్తర్వులు ఇస్తామని హై కోర్టు వెల్లడించింది.

**'బాధితురాలు ముమ్మాటికీ మైనరే'**

పిటిషన్‌పై విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టులో బలమైన వాదనలు

- మిగతా 2లో..

## మోడీ సర్కార్ వైఫల్యానికి
# ప్రజలు బలి

- చమురు ధరల భారమంతా సాధారణ ప్రజల పైనే
- రవాణా నుంచి కూరగాయల వరకు అన్ని ధరలకూ రెక్కలు!
- దేశంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం
  : ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు
- పశ్చిమాసియా ఉద్రిక్తతలను కారణంగా చూపుతున్న కేంద్రం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశంలో పెట్రోల్, డీజీల్ ధరలు మళ్లీ పెరిగాయి. సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. దాదాపు నాలుగేండ్ల తర్వాత ప్రభుత్వరంగ చమురు సంస్థలు లీటరుకు సుమారు రూ.3 చొప్పున ధరలు పెంచాయి. దీంతో ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.97.77కు చేరింది. డీజీల్ ధర రూ.90.67కు ఎగబాకింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల కారణమని కేంద్రం చెప్తున్నప్పటికీ.. ఈ భారాన్ని పూర్తిగా ప్రజల పైనే మోపుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజలకు ఇంధన పొదుపు సందేశం.. ?ఉపశమన చర్యలు శూన్యం**

ప్రధాని మోడీ ఇటీవల ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించిన విషయం విదితమే. ఇది జరిగిన కొన్ని రోజులకే కేంద్రం ప్రజలపై పెట్రో వడ్డన షురూ చేయడం గమనార్హం. అయితే ఇంధన ధరలను నియంత్రించేందుకు కేంద్రం ఎలాంటి ప్రత్యక్ష? ఉపశమన చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపిస్తూ కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకుంటోందని ప్రతిపక్ష?లు, సాధారణ ప్రజలు విమర్శిస్తున్నారు.



**రవాణా ఖర్చులు భారీగా పెరిగే అవకాశం**

దేశంలో పెట్రోల్, డీజీల్ ధరల పెరుగుదల ప్రభావం ముందుగా రవాణా రంగంపై పడనుంది. కార్లు, బైకులు వినియోగించే వారి రోజువారీ ప్రయాణ ఖర్చులు పెరగనుండగా..

- మిగతా 2లో..



## అదానీ విడుదల కోసమే ప్రధాని అమెరికాతో
# వాణిజ్య ఒప్పందం

**- లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

బిలీయనీర్ వ్యాపారవేత్త అదానీ విడుదల కోసం బేరం కుదుర్చుకునేందుకే ప్రధాని మోడీ అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం విమర్శించారు. అదానీ లంచాన్ని దాచిపెట్టారని ఆరోపిస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరించుకోవడానికి అమెరికా అంగీకరించిందన్న వార్తలు వెలువడిన అనంతరం రాజీపడిన ప్రధాని మోడీ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేదు.. కానీ అదానీ కోసం బేరసారాలు సాగించారు అని రాహుల్ ఎక్స్ లో విమర్శించారు.

- మిగతా 2లో..



## జూన్ 21న
# నీట్ యూజీ రీ ఎగ్జామ్

**- వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే : ధర్మేంద్ర ప్రధాన్**
**- ప్రశ్నపత్రం లీక్‌తో రద్దయిన నీట్ పరీక్ష**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్య విద్యార్థులు ఎదురు చూస్తున్న నీట్ యూజీ రీ-ఎగ్జామ్ తేదీని కేంద్రం ప్రకటించింది. జూన్ 21న నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించ నున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) అధికారికంగా

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టు
# పుట్టపర్తికి రావడం చారిత్రాత్మక ఘట్టం

**- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు**



శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :

ఏఎంసిఏడి పుట్టపర్తికి రావడం చాలా గర్వకారణం అని కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్దనున్న సభా వేదికలో గురువారం ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో భాగంగా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు మాట్లాడుతూ ఒకప్పుడు రాయల సీమ, అనంతపురం, పుట్టపర్తి అంటే రాళ్లు రప్పలు అని చెప్పేవారు, కానీ ఈరోజు అదే పుట్ట పర్తిలో ఫ్లైట్లు, ఏఎంసిఏ వంటి ప్రాజెక్టులు, కియా పరిశ్రమ, ఒక వైపు బుల్లెట్లు, మరోవైపు డ్రోన్లు తిరుగుతున్నా యంటే, పుట్టపర్తి రూపురేఖలు మార్చిన ప్రభుత్వం మన ఎన్డీఏ ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నాన న్నారు. పుట్టపర్తి అంటే మనకు వెంటనే గుర్తొచ్చేది భగవాన్ శ్రీ సత్యసాయిబాబా అని,

- మిగతా 3లో..

## రాయలసీమ నుంచే
# 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

- ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు
- 36 రోజుల్లో జెట్ స్పీడ్ లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు
- ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారథ్యం
- త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- ఏపీ అంటే అడ్వాన్స్డ్‌ప్రదేశ్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు





శ్రీ సత్య సాయి బ్యూరో- సూర్య వాస్తవం:

అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు సహా వివిధ డిఫెన్సు యూనిట్లతో దేశానికి రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆమ్కా ప్రాజెక్టుతో ప్రధాని మోదీ ఆశిస్తున్న ఆత్మనిర్భర్ భారత్

- మిగతా 3లో..

## వచ్చే ఎన్నికల్లో
# ప్రధాని అభ్యర్థి రాహుల్

హైదరాబాద్- సూర్య వాస్తవం



వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో లోక్‌సభలో ప్రతిపక్ష?నేత రాహుల్ గాంధీనే ప్రధాని అభ్యర్థి అని సీఎం ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రతి పాదనను తొలుత కాంగ్రెస్‌పార్టీలో ఆమోదం తీసుకొని, ఆ తర్వాత ఇం డియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రాహుల్ గాంధీకి కాంగ్రెస్ ను అధికారంలోకి తేవాలనే లక్ష్యం మాత్రమే ఉందనీ, ప్రధాని కావాలని ఆయన ఏనాడూ కోరుకోలేదన్నారు. కానీ ఇటీవల వికారాబాద్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ జాతీయ శిక్ష?ణా సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని

- మిగతా 3లో..

- నేనే ఆయన్ని ఒప్పించా ముందు కాంగ్రెస్‌లో తీర్మానించి, తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తాం
- 2034 తర్వాత నేను సీఎంగా ఉండను
- జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కొడుకును విచారణకు పంపాలి
- సమస్యలు చూసి పారిపోవద్దని ఆయనకు నా సలహా
- దేనికీ భయపడేది లేదు.. మూసీ పునరుజ్జీవం చేసి తీరతాం
- చెరువులు, కుంటలు ఆక్రమిస్తే కూల్చివేతలు తప్పవ్
- ఆర్టీసీ ఇప్పుడు లాభదాయక సంస్థ
- విజన్-2047 అమలే లక్ష్యం
- ఓ మీడియా సంస్థ కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

# అదానీ విడుదల కోసమే ప్రధాని అమెరికాతో వాణిజ్య ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశంలోని తన కంపెనీ భారీ సౌరప్రాజెక్టును లంచం ఇచ్చి దక్కించుకునేందుకు పెట్టుబడి దారులను మోసం చేశారనే ఆరోపణలపై అదానీకి వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరించుకునేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించిందని గురువారం ప్రచురించిన కోర్టు పత్రాల ప్రకారం తెలిసింది. ఈ నివేదికపై కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ స్పందించారు. అమెరికా చేసిన దోపిడీకి, పూర్తిగా ఏకపక్ష భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి ప్రదాని ఎందుకు అంగీకరించారో ఇప్పుడు స్పష్టమైందని అన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం కాకుండా, అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపుల మేరకు ప్రధాని 2025 మే 10న ఆపరేషన్ సింధూర్ ను ఎందుకు ఆకస్మికంగా నిలిపివేశారో కూడా స్పష్టమౌతుంది. మోదానిపై ఉన్న అవినీతి ఆరోపణలన్నింటికీ ట్రంప్ ప్రభుత్వం ఉపసంహరించుకోబోతుందని సమాచారం అని ఎక్స్ లో పేర్కొన్నారు. ప్రధాని ఇంకెంతగా రాజీపడతారని ప్రశ్నించారు. 2024 చివరలో దాఖలు చేసిన వ్యాజ్యంలో, అదానీ గ్రూప్ చైర్మన్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ లో డైరెక్టర్ గా ఉన్న అతని మేనల్లుడు సాగర్ అదానీ, 2020-2024 మధ్య కాలంలో, 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆర్జించే అవకాశం ఉన్న నిబంధనలతో లాభదాయకమైన సౌర విద్యుత్ సరఫరా కాంట్రాక్టులను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 265 మిలియన్ డాలర్లు లంచాలు చెల్లించేందుకు అంగీకరించారని సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజ్ కమిషన్ ఆరోపించింది. లంచాన్ని కప్పిపుచ్చి తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రకటనల ఆధారంగా, అదానీ గ్రూప్ అమెరికా సంస్థలతో సహా పలు సంస్థల నుండి 2 బిలియన్ డాలర్ల రుణాలు, బాండ్లను సమీకరించిందని వ్యాజ్యంలో పేర్కొంది.

# బండి భగీరథ్ కేసులో తీర్పు రిజర్వ్

(మొదటిపేజీ తరువాయి)

వినిపించారు. బండి భగీరథ్‌కు ఎలాంటి ముందస్తు రక్షణ ఇవ్వకూడదని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో బాధితురాలి వయసుపై వస్తున్న అనుమానాలకు పీపీ తెరదించారు. బాధితురాలు ముమ్మాటికీ మైనరేనని ఆయన కోర్టుకు స్పష్టం చేశారు. విచారణలో బాధితురాలి వయసు 17 ఏండ్ల 3 నెలలుగా నిర్ధారణ అయిందని తెలిపారు. దీనికి సంబంధించి ఆమె పదో తరగతి (టెన్త్) మెమోతో పాటు, జీహెచ్ఎంసీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్ కూడా ఉన్నట్టు కోర్టుకు సమర్పించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో సైతం బాధితురాలు మైనర్ అనే విషయం స్పష్టమైందని పీపీ పేర్కొన్నారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో జరిగిన సంఘటన మొత్తాన్ని వివరంగా వివరించిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ”బాధితురాలిని పెండ్లి చేసుకుంటానని నమ్మించి బండి భగీరథ్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతను పెండ్లి చేసుకుంటాడనే నమ్మకంతోనే సదరు బాలిక అతనితో కలిసి బయటకు వెళ్లింది” అని పీపీ వాదనలు వినిపించారు. ఈ కారణాల చేతనే పోలీసులు అతనిపై లైంగిక దాడి కేసులు నమోదు చేశారని, అందువల్ల నిందితుడికి ముందస్తు రక్షణ కల్పించకూడదని కోరారు. కాగా, అంతకుముందు బండి భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టులో తన వాదనలు వినిపించారు. బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలన్న కోర్టును కోరారు.

# జూన్ 21న నీట్ యూజీ రీ ఎగ్జామ్

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. మే 3న జరిగిన పరీక్షా ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తామని పేర్కొంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త తేదీలను ఎన్టీఏ వెల్లడించింది. పారదర్శకమైన రీతిలో జూన్ 21న పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. అడ్మిట్ కార్డులు, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొంది. పునఃపరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్టీఏ కోరింది. వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష: ?కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్ వెల్లడించారు. వచ్చే ఏడాది నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిస్తామని, మళ్లీ మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడటమే మా ధ్యేయమని చెప్పారు. జూన్ 21 నుంచి నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహిస్తామన్న కేంద్రమంత్రి, జూన్ 14 నుంచి అడ్మిట్‌కార్డులు విడుదల చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా ఈ సారి చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఎవరూ నష్టపోకూడదనే పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం.

విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనేది మా మొదటి ప్రాధాన్యం. పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించబోము. పేపర్ ఎలా లీక్ అయింది? ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందనేది పూర్తి వివరాలు బహిర్గతమవుతాయి. సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు చూసి భయపడొద్దు. అడ్మిట్‌కు సంబంధించి ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. పరీక్ష ఫీజు లేకుండా విద్యార్థులకు ప్రయోజనం కల్పిస్తున్నాం. ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని వదిలిపెట్టేది లేదు సీబీఐ అదే పనిలో ఉంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. వ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటాం.” అని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు.

**రీఎగ్జామ్ కు ఫీజు చెల్లించాల్సిన అవసరంలేదు ..ఎన్టీఏ**

దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్టీఏ క్లారిటీ ఇచ్చింది. ఇదిలాఉండగా నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి అధికారులు విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా, అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలు వచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి కూడా ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

# మోడీ సర్కార్ వైఫల్యానికి ప్రజలు బలి

(మొదటిపేజీ తరువాయి)

డీజీల్‌పై ఆధారపడే బస్సులు, లారీలు, సరుకు రవాణా వ్యవస్థలకు అదనపు భారం పడుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. దీని ప్రభావంతో ఆటో, క్యాబ్ ఛార్జీలు, సరుకు రవాణా ధరలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**వంటింటిపై కూడా మంట**

భారత్‌లో ఎక్కువ శాతం ఆహార సరఫరా రోడ్డు రవాణా పైనే ఆధారపడుతుంది. డీజిల్ ధరలు పెరగడంతో కూరగాయలు, పండ్లు, పాలు, ధాన్యాలు, ప్యాకేజ్డ్ వస్తువుల రవాణా ఖర్చులు పెరుగుతాయని నిపుణులు చెప్తున్నారు. చివరకి ఈ భారం వినయోగదారుల పైనే పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే అమూల్, మదర్ డైరీ పాలు లీటరుకు రూ.2 పెంచడం దీనికి ఉదాహరణగా చెప్తున్నారు. ఇక ఇంధన ధరలు ఇలాగే దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలో కొనసాగితే.. ఆహార ద్రవ్యోల్బణం కూడా మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

**ఆన్‌లైన్ డెలివరీలు, ఈ-కామర్స్ సేవలపై ప్రభావం**

ఇంధన ధరల పెరుగుదలతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, గ్రాసరీ, కొరియర్, ఈ-కామర్స్ సంస్థల రవాణా వ్యయాలు పెరగనున్నాయి. దీంతో డెలివరీ ఛార్జీలు పెరగడం, డిస్కౌంట్లు తగ్గించడం, కనీస ఆర్డర్ విలువలను పెంచడం వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం**

ఇంధన ధరల పెరుగుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పైనా తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. డీజీల్‌పై ఆధారపడే ట్రాక్టర్లు, నీటి మోటార్లు, వ్యవసాయ రవాణా వాహనాల ఖర్చులు పెరగనున్నాయి. దీంతో రైతులపై అదనపు భారం పడనుంది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరిగితే ఆ ప్రభావం తిరిగి ఆహార ధరల రూపంలో ప్రజల పైనే పడుతుందని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం**

చమురు ధరల పెరుగుదల ప్రభావం దాదాపు అన్ని రంగాల పైనా ఉంటుంది. తయారీ, రిటైల్, వ్యవసాయం, సేవారంగం... ఇలా ప్రతి చోటా ఖర్చులు పెరుగుతాయి. దీంతో దేశంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం పెరుగుతుండగా, ఇంధన ధరల పెంపు పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**‘డబుల్ ఇంజిన్’ ప్రచారం.. ప్రజలకు డబుల్ భారం**

గత పన్నెండేండ్ల మోడీ పాలనలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ధరల పెరుగుదలలు నిత్యకృత్యమయ్యాయి. అయితే ప్రజల ఆదాయాలు మాత్రం అదే స్థాయిలో పెరగడం లేవు. ఇంధనం నుంచి ఆహారం వరకు.. ప్రతి వస్తువు ధరా పెరుగుతుండటం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులను సాకుగా చూపుతూ ధరల నియంత్రణలో మోడీ సర్కారు విఫలమవుతోందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. చివరకు ప్రతీ సంక్ష?ోభానికి మూల్యం చెల్లించేది సామాన్య ప్రజలేనని వివరిస్తున్నారు.

# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు



(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆమ్కా ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. డీఆర్డీఓలో భాగమైన ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించారు. త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలోని ఆగ్నేయాస్త్ర ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలను కూడా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...”సత్యసాయి బాబా బోధనలతో ఈ ప్రాంతం నుంచి విశ్వ శాంతికి బాటలు పడ్డాయి. ఇప్పుడు పుట్టపర్తిలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకంగా మారింది. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. ఆమ్కా ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు.

ఆధునిక తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఏఎంసీఏ ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. ఏ ఎం సి ఏ లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రోజుల వ్యవధిలోనే అమ్కా ప్రాజెక్టు సాకారం**

“కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చామని సీఎం వివరించారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తున్నాయి. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మొత్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్ధంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్ , ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాల సీమగా మారుస్తాం. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరి కోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం. కియా పరిశ్రమ ఏటా 18 లక్షల కార్లు తయారు చేస్తోంది. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయి. రాయలసీమలోని ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారని” సీఎం వెల్లడించారు.

**గతంలో కేజీఎఫ్ ఇప్పుడు జేజీఎఫ్**

“త్వరలో కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ నుంచి బంగారం ఉత్పత్తి జరుగుతుంది. జీ+ఖీలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1,500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది. సమర్ధవంతమైన నీటి నిర్వహణతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్ తో తీసుకెళ్తున్నాం. అవకాశాలు తెచ్చే బాధ్యత మాది. వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది. గత పాలనలో విధ్వంసం చేశారు. పరిశ్రమలు తరిమేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి, ఇతరులకూ ఇక్కడే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు.

ఏపీలో డిజైన్ చేయండి, పెట్టుబడులు పెట్టండి, ఉత్పత్తులు తయారు చేయండి అని పారిశ్రామిక వేత్తల్ని కోరుతున్నాను. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశానికి తిరుగులేని శక్తిగా రాయలసీమ, ఆంధ్రప్రదేశ్ తయారవుతాయి.” అని ముఖ్యమంత్రి వివరించారు.

**నాదేశం- నాబాధ్యత**

“పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందని...ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయని సీఎం అన్నారు. దేశానికి ఆర్థిక భద్రత కూడా అత్యంత కీలకమని..ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయని తెలిపారు. ప్రధాని మోదీ ఇచ్చిన 7 అంశాలను ఆచరిద్దాం. పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నాం. దీనిపై ఓ కార్యాచరణను కూడా తీసుకువచ్చాం. వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి అంశాలను అమల్లోకి తీసుకు రావాలని కోరుతున్నాను. ప్రతీ భారతీయుడూ ప్రస్తుత సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం వహించాలని” ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఏపీ ఇక అడ్వాన్స్ డ్ ప్రదేశ్- రాజ్ నాథ్ సింగ్**

ఆమ్కా ప్రాజెక్టు ఏపీ సహా దేశ రక్షణలో ఓ చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలతో పాటు రక్షణ రంగ పరిశ్రమల్ని ఆకర్షిస్తున్న ఏపీ పేరు అడ్వాన్స్ ప్రదేశ్ అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

5 జనరేషన్ ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల్ని తయారు చేస్తున్న రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఇలాంటి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాలు కేవలం కొద్దిదేశాల వద్ద మాత్రమే ఉన్నాయని.. ఇప్పుడు భారత్ కూడా ఆ సరసన చేరిందని అన్నారు. అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని చాటేలా మన గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయని కేంద్ర మంత్రి వివరించారు. ఆ తరహా యుద్ధ విమానాలను పుట్టపర్తి నుంచి తయారు చేయబోతున్నామని తెలిపారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటి వరకూ దిగుమతి చేసుకుంటున్న చాలా పరికరాలను కూడా స్వదేశీయంగా తయారు చేసుకోగలమని చెప్పారు.

**7 సంస్థలతో ఒప్పందాలు**

అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు సమక్షంలో 7 సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. రూ. 4460 కోట్ల పెట్టుబడులు, 6400 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఫోర్జ్, రఘువంశీ మెషీన్ టూల్స్ , సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ , ఎన్ఐబీఈ గ్రూప్, పీఎంటీ డిఫెన్స్, చక్రవ్యూహ్ డైనమిక్స్ , ఇండస్ బ్రిడ్జ్ వెంచర్స్ సంస్థలు ఈ ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఆమ్కా ప్రాజెక్టులో నిర్మితం కానున్న అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ నమూనాతో పాటు భారత్ డైనమిక్స్ సహా వేర్వేరు సంస్థలు ఏర్పాటు చేసిన మిస్సైళ్లు, హ్యాండ్ గ్రెనేడ్ లు, టార్పెడో నమూనాలు, ఆధునిక తుపాకుల ప్రదర్శనను కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం తిలకించారు. కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, సవిత, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ సలహాదారు సతీష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# సంపాదకీయం

## ఎన్నాళ్లీ లీకులు...

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయట పడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతంలో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీ కి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు.నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్ది అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేది ఈ పరీక్ష రాసిన విద్యార్థుల గుండెల్లో దిగి న బాకు మాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటి ది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకు పరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు. అవి గుండెలమీద పడే బరువులా అనిపిస్తాయి.పాపం, పుణ్యం తెలియకుండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకు వస్తుందని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతు న్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించారు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు.మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశ యం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భ యం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు.పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం.ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం.కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు.నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చదివిన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు.అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అ నే ప్రశ్నలూ ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవుతుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు.నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటే జ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడు చాలామంది విద్యా ర్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి కాదు, ప్రశ్నకు సరైన సమాధానం గుర్తుపెట్టుకోవడానికి మాత్రమే చదువుతున్నారు. పాఠశా లలు విద్య నేర్పే స్థలాలుగా కాకుండా, పరీక్షలకు సిద్ధం చేసే గదులుగా మారిపోతున్నా యనే విమర్శలు పెరుగుతున్నాయి. కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ విద్యార్థుల ఆశలను మాత్రమే కాదు, వారి భయాలను కూడా వ్యాపారంగా మార్చేసిందిఉదయం నుంచి రాత్రి వరకు టెస్టులు, ర్యాంకులు, పోలికలు, ఒత్తిళ్లు... ఇవన్నీ కలిసి విద్యార్థి బాల్యాన్ని మెల్లగా మింగేస్తున్నాయి. డాక్టర్ కావాలనే కల ఇప్పుడు చాలామందికి సేవాభావం కంటే బతుకుపోరాటంగా మారిపో యింది. ఈ వ్యవస్థలో పిల్లలు చదువుకుం టూ పెరగడం లేదు. కేవలం ఒత్తిడి మధ్య పెద్దవాళ్లు అవుతున్నారు.

నీట్ గురించి మాట్లాడేటప్పుడు మనం మార్కులు, ర్యాంకులు, సీట్ల గురించి ఎక్కువగా మాట్లాడతాం. కానీ, విద్యార్థుల మాన సిక ఆరోగ్యం గురించి చాలా తక్కువగా చర్చిస్తాం. ఒక విద్యార్థి సంవత్సరాల కష్టం ఒక్క పరీక్షపై ఆధారపడినప్పుడు, అతని మనసులో భయం కలగడం సహజం. 'ఫలితం రాకపోతే నా విలువ ఏమిటి?' అనే ప్ర శ్న చాలామంది పిల్లల్ని కుంగదీస్తోంది. బ యటికి కనిపించేది చదువు మాత్రమే.కానీ వారు తమ మనస్సులలో ఒంటరితనం, ఆందోళన, నిరాశతో కూడిన యుద్ధం చేస్తున్నారు. పరీక్ష రద్దు వార్త వచ్చిన క్షణంలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేసి ఉండొచ్చు. కొందరు ఏడ్చి ఉండొచ్చు. కానీ, ఇంకా ప్రమాదకరమైన స్పందన మరొకటి ఉంది. అది నిశ్శబ్దం. ఎందుకంటే చాలామంది పిల్ల లు ఇప్పుడు అలసిపోయారు; కేవలం చదువుతో కాదు, నిరంతర ఒత్తిడితో.

ఇప్పుడు చేయాల్సింది మళ్లీ పరీక్ష నిర్వహించడం మాత్రమే కాదు. ముందుగా విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి నిర్మించాలి. తప్పు ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విచారణలు పారదర్శకంగా జరగాలి. ఎందుకంటే రహస్యంగా జరిగే విచారణలు అనుమానాలను మరింత పెంచుతాయి. పరీక్షా నిర్వహ ణ వ్యవస్థను సాంకేతికంగా మరింత భద్రం గా మార్చాలి. ప్రశ్నాపత్రాల రవాణా నుంచి పర్యవేక్షణ వరకు ప్రతి దశలో డిజిటల్ ట్రాకింగ్ ఉండాలి.అంతకంటే ముఖ్యంగా, ఒకే పరీక్షతో జీవితాన్ని నిర్ణయించే విధానం గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభం కావాలి. స్కూల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలా? బహుళ దశల మూల్యాంకనం అవసరమా? రాష్ట్ర విద్యావ్యవస్థల పాత్ర పెరగాలా? అనే ప్రశ్నలపైనా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.విద్యార్థులకు ప్రత్యేక మద్దతు, స్థానిక భాషల్లో నాణ్యమైన వనరులు అందుబాటులోకి రావాలి. అలాగే ప్రతి కీలక పరీక్ష తర్వాత విద్యార్థులకు, తల్లిదండ్రులకు మానసిక కౌన్సెలింగ్ సపోర్ట్ కూ డా అవసరం. ఎందుకంటే పిల్లలు విఫలమవుతున్నది చదువులో కాదు, ఒత్తిడిని ఒం టరిగా మోయడంలో.దేశ భవిష్యత్తు పరీక్షా హాళ్లలో కూర్చు న్న ఆ పిల్లల చేతుల్లోనే ఉంది. వాళ్లు ప్రశ్నపత్రాలకు సమాధానాలే రాయడం లేదు, త మ జీవితాన్ని రాస్తున్నారు. అలాంటి సమయంలో వ్యవస్థ వాళ్లకు కనీస న్యాయం కూ డా ఇవ్వలేకపోతే, అది పాలనా వైఫల్యమే కా దు, సమాజంగా మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన క్షణం. ఎందుకంటే ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే. కానీ, ఒక త రం మనసులో విరిగిపోయిన నమ్మకాన్ని మళ్లీ నిర్మించడం చాలా కష్టం.

# వచ్చే ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. శుక్రవారంనాడిక్కడి ఓ కన్వెన్షన్ సెంటర్లో ఓ మీడియా సంస్థ నిర్వ హించిన కాన్ క్లేవ్ -2026 లో ఆయన మాట్లాడారు. గాంధీ కుటుం బానికి దేశం పట్ల విశ్వాసం ఉందనీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తో తనకు చొరవ ఉందనీ, అయితే ఎప్పుడు తాను గీతను దాటబోననీ చెప్పారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యు మెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామన్నారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదు అనీ, కానీ తనకు టీడీపీతో ఆ అనుబంధం ఇప్పటికీ ఉందన్నారు.

రాష్ట్ర ప్రజలు 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ కు అధికారం ఇస్తారనీ, అప్పటి వరకు తాను తెలంగాణలోనే ఉండి, రాష్ట్రం కోసం పనిచేస్తాననీ, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానన్నారు. అక్కడ రాహుల్గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యమనీ, ఆయన ఏ బాధ్యత ఇస్తే దాన్ని స్వీకరిస్తానని స్పష్టం చేశారు. 2034 తర్వాత తాను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండబోననీ, తర్వాతి తరానికి అవకాశం ఇస్తానని తేల్చిచెప్పారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసు విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ కేసులో చట్టం ఎక్కడా పక్ష?పాతంతో వ్యవహరించట్లేదన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని స్వయంగా విచారణకు పంపితే రాజకీయంగా గౌరవం లభిస్తుందని సలహా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన ఉన్నందున పోలీసులంతా బందోబస్తు విధుల్లో ఉన్నారనీ, అలాగని ఎక్కడా విచారణ ఆపలేదని వివరించారు. అవసరమైన సాక్ష్యాధారాలన్నీ సేకరించి, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు. సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు ..ఎవరైనా సరే నేరం చేస్తే తనకు ఎలాంటి మినహాయింపులు లేవనీ, చట్టం ముందు అంతా సమానమేనని స్పష్టం చేశారు. బండి భగీరథ్ కేసు విషయంలో ఐదు టీంలు పనిచేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ను బీజేపీలో విలీనం చేసే అంశాన్ని బండి సంజయ్ వ్యతిరేకించినందువల్లే బీఆర్ఎస్ వాళ్లు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ ఇప్పుడు ఐపీఎస్ అధికారి కాదనీ, గడీల పాలనకు వ్యతిరేకంగా గళం ఎత్తి ఇప్పుడు అదే గడీల్లో స్వీయ నిర్భంధం చేసుకున్నాడని విమర్శించారు. వ్యవస్థలను పట్టాలెక్కించాల్సిన బాధ్యత తనపై ఉందనీ, దానికోసమే ప్రతి 15 రోజులకు ఒక సారి జిల్లా పర్యటనలకు వెళ్తున్నానని చెప్పారు. నిధుల సమీకరణ పైన ఎక్కువ సమయం కేటాయిస్తున్నాననీ, జడ్పీటీసీ గా ఉన్నప్పుడు ఏ ఇంట్లో ఉన్నానో ముఖ్యమంత్రి అయ్యాక కూడా అదే ఇంట్లో ఉన్నానన్నారు. కష్టపడ్డ నాయకులకే నామినేటెడ్ పోస్టులు ఇస్తున్నామని, పార్టీ టిక్కెట్లు సామాన్యులకు ఇచ్చి గెలిపించుకున్నామని పలు ఉదాహరణలు వెల్లడించారు. ఎవరు అడ్డువచ్చినా మూసీ ని ప్రక్షాళన చేసి తీరతామనీ, ఆ నదిని ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తే సామాన్లయినా మిగులుతాయనీ, లేకుంటే బుల్డోజర్లతో తొక్కించేస్తామని హెచ్చరించారు. మూసీని ఆక్రమించిన పేదలకు పక్కా ఇండ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు ఉదారంగా ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ తీసుకుంటే ఏ కీలు కు ఆ కీలు తీస్తామని హెచ్చరించారు. తాను అనేక విషయాల్లో పూర్తి స్పష్టతతో ఉంటానని చెప్పారు. తన ఆలోచనలపై కొందరికి భిన్నాభిప్రాయాలు ఉండొచ్చనీ, వందశాతం ప్రజలను మెప్పించాలని కోరుకుంటే అసంతృప్తే మిగులుతుందనీ, 60 నుంచి 75 శాతం మంది మన ఆలోచనలను ఆమోదిస్తే అదే అతి పెద్ద విజయంగా చెప్పుకోవచ్చని స్పష్టత ఇచ్చారు. ఆర్టీసీ ఇప్పుడు లాభాల సంస్థగా మారిందనీ, ప్రతినెలా మహాలక్ష్మి స్కీం ద్వారా ఆర్టీసీకి రూ.350 కోట్లు చెల్లిస్తున్నామన్నారు.

ఇది కేవలం మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే కాదనీ, దీనివెనుక అనేక సామాజిక పరిణామ క్రమాలు ఉన్నాయని వివరణ ఇచ్చారు. ఆర్టీసీకి రెండేండ్లలో రూ.10వేల కోట్లు ఇచ్చామన్నారు. 3000 ఈవీ బస్సులను ప్రవేశపెట్టడంతో ద్వారా డీజిల్ రూపంలో ఆర్టీసీ ఖర్చు చేస్తున్న రూ.2000 కోట్లు ఆదా చేస్తామన్నారు. ఈ సందర్భంగా విజన్-2047 డాక్యుమెంట్లోని అంశాలను సీఎం ప్రస్తావించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బాగుందనీ, కానీ తాను ఆశించినట్టు లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగానే అనేక కారణాలతో రియల్ ఎస్టేట్ గ్రోత్ తగ్గిందని చెప్పారు. కొందరు వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి వస్తుందని కలలు కన్నారనీ, వారి కలలు చెదిరిపోయేసరికి ప్రభుత్వంపై ఆరోపణలు, విమర్శలు చేస్తూ ప్రజల్ని గందరగోళ పరిచే పనులు చేస్తున్నారని పరోక్ష?ంగా బీఆర్ఎస్ నేతల్ని ఉద్దేశించి అన్నారు. డ్రగ్స్ ను కంట్రోల్ చేయడానికి ఈగల్ ఫోర్స్ ను తీసుకువచ్చామనీ, ఫామ్ హౌస్ లో పార్టీలు చేసుకుని దొరికిపోయిన వారు తనను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.

### అడ్వాన్స్డ్ మీడియం కాంబాట్ ఎయిర్క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టు

# పుట్టపర్తికి రావడం చారిత్రాత్మక ఘట్టం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన కృషి వల్ల పుట్టపర్తి ప్రపంచానికి శాంతి కేంద్రంగా మారిందని, ప్రశాంతి నిలయం ద్వారా అంతర్గత శాంతిని ప్రపంచానికి అందించారన్నారు. కానీ శాంతి అనేది రెండు రకాలుగా ఉంటుందని, ఒకటి మనశ్శాంతి, మరొకటి శాంతి భద్రత. ఈరోజు దేశ భద్రత కోసం అడ్వాన్స్డ్ మీడియం కాంబాట్ ఎయిర్క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టు పుట్టపర్తికి రావడం చారిత్రాత్మక ఘట్టం అని, ఇది ఆధుని కతకు, సాంకేతికతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రాజెక్టులు తీసుకురావడం అంత సులభం కాదని, ముఖ్యంగా రక్షణ రంగానికి సంబంధించిన పెట్టుబడులు రావాలంటే ఆ ప్రాంతంపై పూర్తి నమ్మకం ఉండాలని, ఈరోజు రాయలసీమకు ఇంత పెద్ద ప్రాజెక్ట్ రావడానికి కారణం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం, విజన్ అని స్పష్టంగా చెప్పాలన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ మళ్లీ ఒక బ్రాండ్గా ప్రపంచానికి కనిపిస్తోందని, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో స్థానిక బలాలను గుర్తించి ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను తీసుకువస్తున్నారన్నారు. దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25.3 శాతం మన ఆంధ్రప్రదేశ్కే రావడం గొప్ప విషయం అని, దీనికి కారణం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు, చంద్రబాబు నాయుడు గారు, పవన్ కళ్యాణ్ గారు కలిసి నడిపిస్తున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అని అన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక సహకారం అందించిన కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్ గారికి తెలుగు ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఏ ఎం సి ఏ ప్రాజెక్ట్తో పాటు రక్షణ రంగానికి చెందిన మరికొన్ని ప్రాజెక్టులు, అలాగే డ్రోన్ ప్రాజెక్టులు కూడా రాయలసీమకు రావడం ఆనందంగా ఉందన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఆంధ్రప్రదేశ్లో సివిల్ ఏవియేషన్ శాఖ నుంచి ఒక ప్రత్యేక కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నానని, భవిష్యత్తు టెక్నాలజీ డ్రోన్లదేనని భావించి విజయవాడలో డ్రోన్ సమ్మిట్ నిర్వహించామన్నారు. ఆ తర్వాత డ్రోన్ సిటీని దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు నిర్ణయించారని, అది కర్నూలు ఓర్వకల్లు ప్రాంతంలో ఏర్పాటు అవుతోందన్నారు. డ్రోన్ల తయారీ జరుగుతున్నా, పరీక్షించే సదుపాయాలు దేశంలో లేవని, అందుకే కర్నూలు ఎయిర్పోర్ట్ను డ్రోన్ టెస్టింగ్ సంధబాక్స్ ఫెసిలిటీ గా అభివృద్ధి చేస్తున్నాం, ఇది దేశంలోనే మొదటిసారి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి కూడా డ్రోన్ టెక్నాలజీ ఎంతో ముఖ్యమైన అంశం అని, అందుకే డ్రోన్ శక్తి మిషన్ ద్వారా ప్రొడక్షన్ లింకేడ్ ఇన్సెంటివ్స్ , రీసెర్చ్ ఇన్సెంటివ్స్ తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అవకాశాల రాష్ట్రంగా, పెట్టుబడుల రాష్ట్రంగా మారడం ఎంతో గర్వంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, మోడీ గారి ప్రోత్సాహం, ప్రజల ప్రేమతో చిన్న వయసులోనే కేంద్ర కేబినెట్ మంత్రిగా పనిచేసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా న్నారు. యువతకు అవకాశాలు కల్పించడంలో చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందుంటారని, అదే స్ఫూర్తితో మన రాష్ట్ర అభివృద్ధికి మేము కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎయిర్పోర్టుల అభివృద్ధి, అంతర్జాతీయ కనెక్టివిటీ పెంపుపై దృష్టి పెట్టాం అని, విశాఖపట్నం నుంచి అబుదాబికి విమాన సర్వీసులు ప్రారం భించాం, విజయవాడ నుంచి సింగపూర్కు కూడా విమాన సర్వీసులు తీసుకువచ్చామన్నారు. త్వరలో తిరుపతి నుంచి కువైట్కు కూడా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నామన్నారు. రాష్ట్రంలో విమాన ప్రయాణికుల సంఖ్య కూడా భారీగా పెరుగు తోందని, ఇది అభివృద్ధికి సంకేతం అని పేర్కొన్నారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతాలుగా భావించిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు ఈరోజు ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని, గూగుల్ వంటి సంస్థలు విశాఖపట్నంపై ఆసక్తి చూపడం దీనికి ఉదాహరణ అన్నారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు ఏ ప్రాంతాన్నీ వదలకుండా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 లక్ష్యాల సాధనకు మీ ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా నన్నారు. రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ గారికి మరోసారి నా ప్రణామాలు, ఇంత పెద్ద ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్కు రావడానికి మీరు అందించిన సహకారం మరువలేనిదన్నారు. రక్షణ రంగ అభివృద్ధి వల్ల సివిల్ ఏవియేషన్ రంగానికి కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని, అందుకే ఈ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ భవిష్యత్తులో మన రాష్ట్రానికి మరింత అభివృద్ధి తీసుకువస్తుందని విశ్వసిస్తున్నా నన్నారు. నేను భారత ప్రభుత్వ మంత్రినైనా, ఇక్కడ మాత్రం ఒక లోకల్ బాయ్ని అని, అందుకే ఈ రాష్ట్రాన్ని ప్రతినిధ్యం వహించడం నాకు గర్వంగా ఉందన్నారు.

# జగన్ మావిగన్ యూ టర్న్...

**విజయవాడ– సూర్య వాస్తవం :**

ఏపీ రాజకీయాల్లో ఒకప్పుడు మూడు రాజధానుల మంత్రం పఠించిన వైసీపీ హఠాత్తుగా మావిగన్ అనే ఊహాజనిత రాజధానిని ప్రకటించింది. జగన్ రెడ్డి ప్రకటించిన ఆ రాజధాని కాస్తా ఇప్పుడు ఆ పార్టీకి మింగుడు పడని వ్యవహారంగా మారింది. అమరావతికి పోటీగా అత్యంత ఖర్చు తక్కువతో ఈ కారిడార్ను అభివృద్ధి చేయవచ్చని అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించినా, అది క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ పొందకపోగా.. తీవ్ర స్థాయిలో ఎకసెక్కాలకు గురవుతోంది. సోషల్ మీడియాలో వస్తున్న సెటైర్లు, విమర్శలకు సమాధానం చెప్పుకోలేక ఇప్పుడు వైసీపీ శ్రేణులు ఈ అంశంపై వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి.అమరావతిని అవినీతి గనిగా అభివర్ణిస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మావిగన్ మోడల్ను తెరపైకి తెచ్చినప్పుడు వైసీపీ నేతలు ఆకాశమే హద్దుగా మాట్లాడారు. కానీ, అది కేవలం ఒక ఊహాజనిత పదంగానే మిగిలిపోయిందని, దానికి ఎలాంటి శాస్త్రీయ పునాది లేదని మేధావుల నుంచి వచ్చిన విమర్శలతో ఆ పార్టీ డిఫెన్స్లో పడింది. అసలు మావిగన్ అనే పేరు వినగానే జనాల్లో వస్తున్న నవ్వులు చూశాక, ఈ అంశంపై చర్చ పెడితే పరువు పోవడం ఖాయమని గ్రహించిన నేతలు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రోజా వంటి వారు సైతం ఇప్పుడు ఆ రెండు ప్రాంతాలు ఒక్కటే కదా అంటూ సర్దుబాటు మాటలు మాట్లాడుతుండటం ఆ పార్టీలో నెలకొన్న అయోమయానికి నిదర్శనం.అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చి, నిధులు కూడా మంజూరు చేస్తున్న తరుణంలో మావిగన్ ప్రస్తావన వైసీపీకి సెల్ఫ్ గోల్లా మారింది. ఒకవైపు అమరావతిలో పనులు శరవేగంగా జరుగుతుంటే, కేవలం ప్లాన్-బి అంటూ లేని కారిడార్ గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతుందని ఆ పార్టీకి ఆలస్యంగా జ్ఞానోదయం అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు మేధావులతో చర్చలు లేవు, సోషల్ మీడియాలో పోస్టులు లేవు. కేవలం తాడేపల్లి ప్యాలెస్కే పరిమితమైన ఈ మావిగన్ సిద్ధాంతాన్ని జనం మరిచిపోయేలా చేయడమే ఇప్పుడు వైసీపీ ముందున్న ఏకైక మార్గంలా కనిపిస్తోంది. అమరావతిని దెబ్బకొట్టాలని తీసిన మావిగన్ అస్త్రం తిరగబడి సొంత పార్టీకే తగిలింది. రాజకీయంగా మైలేజ్ వస్తుందని ఆశించిన ఈ కాన్సెప్ట్ కాస్తా, ఇప్పుడు కేవలం మీమ్స్కు మాత్రమే పరిమితం కావడంతో వైసీపీ నేతలు ఇప్పుడు గన్ తీసి పక్కన పెట్టి, మళ్ళీ పాత సంక్షేమ రాగాన్నే అందుకోవాలని చూస్తున్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకుందాం

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పిలుపు**



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకోవాలని, ఈ పథకాన్ని నిరంతరం కొనసాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని కమ్మూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉపాధి కూలీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ విబీజి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తూ కూలీలకు పని దినాలు పెంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలి. గ్రామీణ పేదల ఆర్థిక వెన్నుముక అయిన ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కోతలు విధించడం సరికాదన్నారు. కూలీల హక్కుల కోసం సిపిఐ మరియు అనుబంధ సంఘాలు ఎప్పుడూ ముందుంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, నాగరాజు, పెద్దయ్య, మరియు సిపిఐ నాయకులు నాగేంద్ర, పెరుగు సంగప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు చందు, మంజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- వైసీపీ నాయకుల శుభాకాంక్షలు**
**- ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష**



**పెళ్లకూరు– సూర్య వాస్తవం :** శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు పెళ్లకూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎప్పుడూ ముందుండి సేవలందించారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సేవ చేస్తూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని మాజీ ఎమ్మెల్యేపై తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ పొలంరెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ ప్రెస్కిల, మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, యువజన విభాగ అధ్యక్షులు సాగి జితేంద్ర నాయుడు, బండి బాలు, అట్ల గోపాల్, కన్నలి బాలాజీ, సూళ్లూరుపేట నియోజకవర్గ వింగ్ అధ్యక్షులు శ్రీపురం మునిరాజ, మండల కళాకారుల అధ్యక్షులు అట్ల కృష్ణయ్య, పి.వి. రమణ రెడ్డి, రఘు నాయుడు, మోహన్ రెడ్డి, గంజి మతయ్య, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అందించే సాయంతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

**- టీడీపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి**

**వేముల– సూర్య వాస్తవం :** ప్రభుత్వం అందించే సహాయ సహకారాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెదేపా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి పేర్కొన్నారు. వేముల మండలం స్థానిక వేముల గ్రామంలో ఎగ్ కార్ట్ ను తెలుగుదేశం పార్టీ ఎక్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ పేర్ల పార్థసారథి రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు 100% సబ్సిడీ తో ఉచితంగా లక్ష రూపాయలు విలువ చేసే ఎగ్ కార్ట్ ను మంజూరు చేయడం హర్షనీయమని, డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా వారికి మెరుగైన వ్యాపారం కోసం జీవనోపాధి కల్పనకు కృషి చేస్తున్నారని ప్రభుత్వం అందించే సహాయం తో డ్వాక్రా మహిళలు అభివృద్ధి వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఆంజనేయులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ జ్యోతి, నాగేశ్వరి, జయపాల్, గంగరాజు గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు పవన్ కుమార్, బాబావల్లి కుమారి ఎస్టిడి భాష,తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- పార్లమెంట్ సభ్యులు బస్తిపాటీ నాగరాజు
- కూటమి ప్రభుత్వనికి బీసీల అండ
- జాతీయ బిసి సంక్షేమ సంఘంరాష్ట్ర అధ్యక్షులు కర్నూలు డి.సి.ఎం.ఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరావు యాదవ్



**కర్నూల్ – సూర్య వాస్తవం :**కర్నూలు పట్టణంలోని బి క్యాంపు సమీపంలో నూతనంగ నిర్మిస్తున్న బిసి భవనం నిర్మాణం జరుగుతున్నందున గతంలో కేటాయించిన బిసి భవనానికి మరమ్మతులు చేపట్టేందుకు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు 10 లక్షల కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో శుక్రవారం నాడు ఉదయం విలేకరుల సమావేశము ఏర్పాటు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.కర్నూలు పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గల్లో వివిధ బిసి కులాల కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి తనవంతు నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనంతరం కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వర యాదవ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధి సంక్షేమ దృష్టిలో ఉంచుకొని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం కర్నూలు పట్టణంలోని బి క్యాంపు లో బీసీ భవనానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయడం జరిగిందని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిసి భవనానికి నిధులు కేటాయించకుండ కల్లబొల్లి మాటలతోనే కాలం గడిపిందని. కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మన యువ నేత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ టి జి భరత్ గారు కర్నూల్లోని బిసి భవనానికి నిధులు కేటాయించి మళ్లీ బిసి భవన నిర్మాణనికి పూను కున్నరన్నారు.. అలాగే జాతియ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య గారు బీసీ భవనానికి కోటి రూపాయలు నిధులు మంజూరు చేయగ మొదటి విడతగా 60 లక్షల బడ్జెట్ కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు.. వైసిపి పార్టీ బీసీల రిజర్వేషన్లు తగ్గించి బిసి లకు వెన్నుపోటు పొడిచిందని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి పూను కుందని ఆయన కొనియాడారు.. అలాగే బిసి రక్షణ చట్టం.. అలాగే బీసీలు ఎన్ని కులాలకు సమానంగా రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ ఈరోజు కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని .. అలాగే మన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవనీయులు శ్రీ నారా లోకేష్ బాబు గారు బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మంచిర్యాంకులు సాధించేందుకు ఆయన పాత్ర అమోఘ మైనదని అయన కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపేట రాంబాబు... రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణజీరావు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ. జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి రామకృష్ణ. జిల్లా అధికార ప్రతినిధి బీసన్న. వీరేష్. జిల్లా ప్రధాన కార్యదర్శి పిజి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

**పులివెందుల – సూర్య వాస్తవం :** ఈ ఏడాది 2026 తమ కళాశాల విద్యార్థులు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్వహించిన 'ఏపీ పీజీఈసెట్' పరీక్షలో రాష్ట్రంలోనే ప్రథమ మరియు ద్వితీయ ర్యాంకులు సాధించారని పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ మాట్లాడుతూ ఈ ఏడాది ఏపీ పీజీఈసెట్ ప్రకటించిన ఫలితాల్లో ఫుడ్ టెక్నాలజీ సబ్జెక్టుకు సంబంధించి, సుప్రియ అనే కళాశాల విద్యార్థినికి రాష్ట్రంలో మొదటి ర్యాంకు వచ్చిందని, అలాగే కావ్యప్రియ అనే మరో విద్యార్థినికి రాష్ట్రంలో రెండవ ర్యాంకు వచ్చిందని, ఈ ఫలితాలు పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి గర్వకారణమని తెలిపారు. అలాగే ఇద్దరు విద్యార్థులు కావ్య ప్రియ, రాజ్ కుమార్ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నిర్వహించబడే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ పోటీ పరీక్షలో కూడా అర్హత సాధించారని తద్వారా కేంద్ర విశ్వవిద్యాలయాలలో పీజీ అభ్యసించుటకు ప్రవేశం పొందడానికి అర్హత సాధించిందని తెలిపారు. రాబోయే ఐకార్ పీజీ పోటీ పరీక్షలో మరింత మంది విద్యార్థులు ఇటువంటి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన ఇద్దరు విద్యార్థినులును, ఇటువంటి ఉత్తమ ఫలితాలకు కారణమైన కళాశాల అధ్యాపకులను అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ ప్రత్యేకంగా అభినందించారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరంలో కూడా గేట్ వంటి పోటీ పరీక్షలలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఇటువంటి ఉత్తమ ఫలితాలకు కారణం అంకితభావం గల అధ్యాపకులు, తరగతుల బోధన, అత్యాధునిక ప్రయోగశాలలు పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉండడం వలన సాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ మాట్లాడుతూ గత సంవత్సరం నుండి పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో, ఎం.టెక్ (ఫుడ్ టెక్నాలజీ) "ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్" కోర్సు కూడా ప్రారంభించామని తెలిపారు. కళాశాలలో ఎంటెక్ కోర్సు అభ్యసించాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా ఐకార్ పీజీ పరీక్ష "ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గ్రూప్ సబ్జెక్టులో" రాసి, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే కౌన్సిలింగ్ లో పాల్గొనాలని తెలియజేశారు.




## భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వైశాఖ మాసము చివరి శుక్రవారము పురస్కరించు కుని ఉదయస్త మాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారం లో చౌడేశ్వరి అమ్మవారు విశేష పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.16-05-2026 శనివారం అమ్మవారి జన్మతిథి అమావాస్య సందర్భంగా ఆలయములో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి, అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము, కుంకుమార్చన, బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు.ప్రత్యేకించి ఆది,మంగళ,శుక్రవారములు,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి 108 ప్రదక్షిణములు చేసి 108 పసుపు కొమ్ముల మాల సమర్పించి నమస్కరించిన యెడల కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపారమైనటువంటి నమ్మకము.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. .ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు.




## క్రమ శిక్షణ ఉంటేనే విద్యార్థికి భవిష్యత్తు

**- తహశీల్దారు మోహన్ కృష్ణ**

**వేంపల్లె – సూర్య వాస్తవం:** క్రమ శిక్షణ ఉంటేనే జీవితంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తాహసిల్దారు మోహన్ కృష్ణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ తరగతుల కేంద్రాన్ని శుక్రవారం తాహసిల్దారు మోహన్ కృష్ణ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శెలవుల్లో చెడు అలవాట్లుకు లోను కాకుండా ఉండేందుకు ఇంగ్లీష్, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్ పై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఉచిత శిక్షణ తరగతులు పెట్టడం సంతోషకరమని చెప్పారు. ఉచిత వేసవి శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో పట్ల కూడ మొగ్గు చూపాలని కోరారు. చదువుపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాలని కోరారు. చెడు అలవాట్లుకు లోను అయితే జీవితం అంధకారం అవుతుందని చెప్పారు. చదువులో, క్రీడాల్లో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. శిక్షణ తరగతుల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను తాహసిల్దారు అభినందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిర్వహకులు బందెల రామాంజనేయులు, ఇల్లూరు పుల్లయ్య, చిప్పిరి ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నారుల కేరింతలు.. యువత ఉత్సాహంతో జలవిహార్ సందడి

**-వేసవి వేడిని మరిపిస్తున్న వాటర్ గేమ్స్, రైన్ డ్యాన్స్‌లు**
**-కుటుంబాలు, యువతతో కిటకిటలాడుతున్న జలవిహార్**




**చెన్నూరు– సూర్య వాస్తవం :** వేసవి తాపాన్ని దూరం చేస్తూ చెన్నూరు సమీపంలోని "జలవిహార్" సందర్శకులతో కళకళలా డుతోంది. సెలవులను ఆనందంగా గడపాలని భావిస్తున్న కుటుంబాలు, యువత పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ప్రాంగణం సందడిమయంగా మారింది. కడప-కర్నూల్ జాతీయ రహదారి పాత టోల్‌గేట్, అలాంఖన్‌పల్లె సర్కిల్ సమీపంలో వైభవ్ హోటల్ పక్కన ఏర్పాటు చేసిన ఈ జలవిహార్‌లో వాటర్ గేమ్స్, వేవ్ పూల్స్, రైన్ డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చిన్నారులు నీటి జారులపై ఆడిపాడుతూ కేరింతలు కొడుతుండగా, యువత డీజే సంగీతానికి స్టెప్పులేస్తూ సందడి చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కలిసి నీటి ఆటల్లో పాల్గొంటూ వేసవి వేడిని మరచిపోతున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచే సందర్శకుల రద్దీ ప్రారంభమవుతుండగా, వారాంతాల్లో ఈ రద్దీ మరింతగా పెరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. సందర్శకుల భద్రత కోసం లైఫ్ గార్డులను నియమించి ప్రతి ఆట వద్ద ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ప్రత్యేక నీటి క్రీడలు, కుటుంబాల కోసం వేర్వేరు వినోద కార్యక్రమాలు అందుబాటులో ఉంచారు. పరిశుభ్రత, నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు నిర్వాహకులు గాజులపల్లె రామచంద్రారెడ్డి తెలిపారు. జలవిహార్ ప్రాంతంలోనే భోజన వసతి, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ తదితర సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. తక్కువ ధరల్లో అందుబాటులో ఉన్న ఈ జలవిహార్ ప్రతి ఒక్కరికి ఆహ్లాదకరమైన అనుభూతిని అందిస్తోందని, వేసవి సెలవుల్లో తప్పక సందర్శించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## టీడీపీ కార్యకర్త నాగరాజు హత్య కేసులో

# రాఘవరెడ్డి కీలకపాత్రని నిగ్గు తేల్చాలి

**- నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలి**
**- అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి**



**పులివెందుల – సూర్య వాస్తవం :** అంబకపల్లి టిడిపి సిన్సియర్ కార్యకర్త నాగరాజు హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి కీలకపాత్ర నిగ్గు తేల్చి నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని తెదేపా కడప జిల్లా తెలుగు యువత కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులు విజయ్ కుమార్ రెడ్డి మరియు మెహబూబ్ భాష గత ఐదు సంవత్సరాలుగా పులివెందులలో పోలీసుల పనితీరును ప్రశ్నించే ప్రయత్నం చేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, వైకాపా హయాంలో పోలీసులు సామాన్య కార్యకర్తల నుంచి పెద్ద నాయకుల వరకు అందరినీ ఇబ్బందులకు గురి చేశారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు లేదా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు అక్రమ కేసులు పెట్టి వేధించారని, ?2020లో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఒక పోస్ట్ పెట్టినప్పుడు, అప్పటి ఎస్సై గోపీనాథ్ రెడ్డి మరియు భాస్కర్ రెడ్డిలు నన్ను తీవ్రంగా కొట్టి, మానసిక వేదనకు గురిచేశారని, ఒక చిన్న కౌన్సెలింగ్ ఇచ్చి పంపాల్సిన విషయాన్ని పెద్ద నేరంగా చిత్రించి నన్ను రిమాండ్‌కు పంపారని ఆ సమయంలో వైకాపా నాయకులు అధికారులు వెనుక ఉండి మమ్మల్ని హింసించారని,?అలాగే రైల్వే ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరినందుకు నాపై కిడ్నాప్ కేసు పెట్టి 40 రోజులు జైల్లో నిర్బంధించారని, అవినాష్ రెడ్డి పీఏల ఒత్తిడితో అధికారులు ఈ అక్రమాలకు పాల్పడ్డారని, పులివెందులలో మహబూబ్ బాషా లాంటి సామాన్యుల స్థలాలను కూడా నకిలీ పత్రాలతో ఆక్రమించుకున్నారని, బాధితులు ఎస్పీకి లేదా కోర్టుకు వెళ్లినా సరైన న్యాయం జరగలేదని, ?రాఘవ రెడ్డి అనే వ్యక్తి అనేక అక్రమాలకు పాల్పడ్డారని వాటిలో భాగంగానే అంబకపల్లి నాగరాజు హత్య కేసులో ఆయన ప్రమేయం ఉన్నా అధికార బలంతో బయటపడ్డారని ఇప్పుడు కూడా అమాయకులైన కార్యకర్తలపై దాడులు చేయిస్తూ, పోలీసు స్టేషన్లలో కూర్చుని అధికారులను ప్రభావితం చేస్తున్నారని ఇలాంటి వ్యక్తులకు పోలీసు స్టేషన్లలో గౌరవం దక్కడం బాధాకరమని, మా నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేష్, రవీంద్రనాథ్ రెడ్డి ఫ్లెక్సీలను చింపిన వారిపై కేసులు పెట్టినా పోలీసులు స్పందించడం లేదని, గత ప్రభుత్వంలో మేము పడిన బాధలు వర్ణనా తీతమని ఇకనైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి రాఘవ రెడ్డి అక్రమాలపై మళ్ళీ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పులివెందులలో శాంతిభద్రతలు మెరుగుపడటం సంతోషకరం కానీ అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్నది మా అభిమతం అని తెలియజేశారు.

# పెట్రోల్, డీజిల్ పెరుగుదల ప్రజా జీవనం పై తీవ్ర ప్రభావం

**-అన్ని రకాల వ్యాపారాల పైన తీవ్ర ప్రభావం...**
**-అమాంతం పెరుగనున్న ధరలు..**
**-పేద మధ్య తరగతి పై తీవ్ర ప్రభావం...**
**-ఐదు రాష్ట్ర ఎన్నికలు అయినా వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన బిజెపి...**
**- డాలర్‌తో పోల్చుకుంటే దారుణంగా పడిపోయిన రూపాయి - దేశానికి ప్రమాదం బీజేపీ**
**- ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెట్రోల్ మరియు డీజిల్ ధరలు పెరగడం సాధారణ ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం అవుతుందని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్ అన్నారు. శుక్రవారం ఆర్‌ఎస్‌ఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా ఉన్న సమయంలో ఇంధన ధరల పెంపు రైతులు, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు మరియు రవాణా రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోండి అన్నారు .పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి, దాని ప్రభావం కూరగాయలు, ధాన్యాలు, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడుతోంది అన్నారు.. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనుల కోసం డీజిల్‌పై ఆధారపడటంతో వారి ఉత్పత్తి వ్యయం మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుంద న్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇంధన ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర పన్నులను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ప్రజల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని పారదర్శకమైన ధరల విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇంధన ధరల పెంపు వల్ల ఏర్పడుతున్న భారాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్రం లోని బిజెపి వలెనే డాలర్ తో పాటు రూపాయి భారీగా పడిపోవడం.

పెట్రోల్ డీజిల్ పెరగడం బిజెపి వలనే అని,ఈ దేశానికి బిజెపి హానికరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, రెడ్డి సాయి, నగర నాయకులు నీలకంఠ పాల్గొన్నారు.

# అనాథలను ఆదుకోవడం మానవ ధర్మం

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**

**వేంపల్లె – సూర్య వాస్తవం:** అనాధలను ఆదుకోవడం మానవ ధర్మం అని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. అమెరికాలో స్థిరపడ్డ తన మిత్రుడు తొండమనాటి సుభాష్ కుమార్తె హాసిని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వేంపల్లి రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అన్న వితరణతో పాటు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా సమాజంలో నిరధారణ కు గురైన వృద్ధులను చేరదీసి వారిని సొంతవారిలా చూసుకుంటున్న దేరంగుల వెంకట సుబ్బయ్యను అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ



కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ ఘనబోయిన రవి యాదవ్ సలీం ప్రసాద్ సురేష్ ఆశ్రమ నిర్వాహకుడు దేరంగుల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆంజనేయస్వామి కోనేరులో పూడిక తొలగింపు

**- టెక్నికల్ అసిస్టెంట్ రామ్ నాయక్**



**వేముల– సూర్య వాస్తవం :** వేముల స్థానిక వంక గడ్డ ఆంజనేయస్వామి గుడి ప్రాంగణంలోని కోనేరులో ఉపాధి హామీపని లో భాగంగా శుక్రవారం ఉపాధి కూలీల చేత పూడికను తీయించడం జరిగింది.వంకగడ్డ ఆంజనేయస్వామి గుడికి వందల సంవత్సరాలు చరిత్ర కలిగి ఉందని భక్తులు, ప్రజలు చెప్తున్నారు. జే ఈ మధుసూదన్ రెడ్డి సహాయ సహకారంతో పూడికను విజయవంతంగా తీయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పవన్ కుమార్, గండి నాగభూషణం, కంప రాఘవేశ్వర, చిన్న సుబ్బారెడ్డి, చిట్టిబోయిన గంగయ్య, ఆటో రాజా భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

# 'స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర'పై అవగాహన



**పులివెందుల – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా రూపొందించే ప్రక్రియలో భాగంగా నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మునిస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం పత్రికలకు అందించిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యాలలో భాగంగా పులివెందులలో ని శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ వద్ద శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవగాహన కార్యక్రమంలో పుర ప్రజలు మరియు పుర ప్రముఖులు పాల్గొని ప్రతిజ్ఞ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పత్రికా ముఖంగా పిలుపునిచ్చారు.

# మహిళలకు ఉచితగా జాబ్ మేళా

**నల్లచెరువు – సూర్య వాస్తవం :** శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం బడుగు బలహీన వర్గాల మహిళలకు సువర్ణ అవకాశం ప్రముఖ పారిశ్రామికవేత్త బిల్డర్ పాళ్యం సుధాకర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తూ పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ దొడ్డబలపూర్ అప్పారెల్ పార్క్ కంపెనీ ఉంది. 3000 మంది పైగా వర్కర్స్ పనిచేస్తున్నారు. కదిరి నియోజవర్గంలో పేదవారు ఎక్కువగా ఉన్నారు ఉద్యోగా అవకాశం కల్పించాలని పాల్యం సుధాకర్ వారి మిత్రుడు కోరగా 1000 మందికి అవకాశం ఇచ్చారని పాల్యం సుధాకర్ తెలిపారు. వేదిక నల్లచెరువు సాయి మాలిక్ థియేటర్‌లో ఉచితంగా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారు నెలకి జీతం 12000, నుంచి 15000 వరకు ఇస్తారని తెలిపారు. అకామిడేషన్ నెలకి 600 రూపాయలు మాత్రమే ట్రైనింగ్ వివరాలు త్వరలో ప్రకటిస్తారని పాల్యం సుధాకర్ తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా**



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలంలో ఎంపీడీవో ఆఫీస్ దగ్గర ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు పెం డింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మల్లేష్ మాట్లా డుతూ గ్రామీణ ప్రాం తాల్లో వ్యవసాయ కూలీలకు పేదలకు ఇతర వృత్తిదారుల కు గ్రామీణ ఉపాధి పనులు పేదలకు ఒక వరం లాంటిదని ఆకలి చావులను నివారణకు ద్రోహర పడుతుందని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గుత్తి మండల వ్యాప్తంగా సక్రమం గా అమలు చేయాలని పెండిం గ్ బిల్లులను వెంటనే మంజూ రు చేయాలని ప్రతి కూలీకి 20 0 రోజులు పనులు కల్పించా లని ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా కూలీలకు టెంటు మజ్జిగ నీటి సౌకర్యం.ఓఆర్ ఎస్ ప్యాకెట్లు కూలీలకు అం దుబాటులో ఉండే విధంగా చూడాలని మరియు కొత్తగా తెచ్చిన ఫేస్ యాప్ ని వెంటనే రద్దు చేసి పాత పద్ధతిలోనే పనులు చేసే విధంగా కృషి చేయాలని కూలీలు కోరిన చోటే పనులు కల్పించి స మాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉపాధి హామీ ప నులు సోలార్ కంపెనీలకు చేయకూడదని కూలీలకు.గడ్డ పారలు,పారలు,బోలెలు తక్ష ణం ఇవ్వాలని కూలీల పట్ల అధికారుల అజమాయిషీ చెయ్యడం మంచి పద్ధతి కాదని వెంటనే ఇలాంటి పద్ధతులు మానుకోకపోతే వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చందు సహాయ కార్యదర్శి ఓ న్నూరమ్మ,ఉపాధ్యక్షురాలు ఊర్మిళ కమిటీ సభ్యులు రెడ్డమ్మ,రామేశ్వరి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**ఉరవకొండ– సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఉరవకొండ మండలం పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ లైనింగ్ పనులను క్షేత్రస్థాయిలో శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లాలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా, ఈ కాలువ లైనింగ్ పనుల పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గత సంవత్సరం చేపట్టడం జరిగిందనీ, ప్యాకేజ్ 88 నుండి 216.3 కిలోమీటర్ల పొడవునా కర్నూలు, అనంతపురం జిల్లాలో హంద్రీనీవా జలాలు ప్రవాహం ఉంటుందని, ఇందులో మన అనంతపురం జిల్లాలో 144 కి.మీ నుండి 216.3 కి.మీ పొడుగునా విస్తరించి ఉందని తెలుపుతూ ఇందులో ఎక్కడ కూడా గండ్లు పడకుండా సీపేజీ లీకేజీ లేకుండా లైనింగ్ పనులు జిల్లాలో 82 కిలోమీటర్ల పరిధిలో 6.50 కిలోమీటర్ల కాలువ లైనింగ్ పనులు గుర్తించి వాటి పనులు పురోగతిలో ఉన్న నేపథ్యంలో ఉరవకొండ మండలం కౌకుంట్ల, రామాపురం పరిధిలో జరుగుతున్న లైనింగ్ పనులను పరిశీలించడం జరిగిందని తెలిపారు.సాగు నీరు రైతులకు ఇబ్బంది కాకుండా ఉండేందుకు వీటిని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుంతకల్ డివిజన్ శ్రీనివాస్ నాయక్,కాంట్రాక్టర్ ప్రతినిధి రామకృష్ణ యాదవ్, డిఈఈ రమణ, ఏఈలు సుదర్శన్ మూర్తి, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.

# విస్తృతంగా వాహన తనిఖీలు ...

## - రోడ్డు ప్రమాదాలు అడ్డుకట్టే లక్ష్యం





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో అనంతపురం జిల్లాలోని సీ.ఐ ల నుంచి హోంగార్డు వరకూ అందరూ శు క్రవారం నాడు సాయంత్రం నుంచి రాత్రి వరకు అన్ని ప్రాంతాల్లోనూ ఏకకాలంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రతను పెంపొందించే దిశగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లంఘన దారులపై ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీటుబెల్ట్ ధరించక పోవడం, ఓవర్ స్పీడ్, అధికలోడ్ తో వెళ్లే వాహనాలకు, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై కేసులు నమోదు చేసి ఫైన్లు విధించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పోలీసులు మాట్లాడుతూ..."ప్రజల ప్రాణ భద్రతే మా ముఖ్య లక్ష్యం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, సురక్షితంగా ప్రయాణించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాగే చర్యలు కొనసాగిస్తాం" అని సూచించారు.

# చిరు వ్యాపారులకు తీపి కబురు

## - 1.15 పైసల వడ్డీకే రుణాలు - జేసీ ప్రభాకర్ రెడ్డి



**తాడిపత్రి – సూర్య వాస్తవం:** మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నేను తాడిపత్రి పట్టణంలో పర్యటిస్తున్నప్పుడు చిరు వ్యాపారులు కూరగాయల విక్రేతలు, తోపుడు బండ్ల వారు, 4 లేదా 5 రూపాయలు వడ్డీకి డబ్బులు తీసుకొని ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారికి తాడిపత్రి టౌన్ బ్యాంకు నుండి రూ.10000 రూపాయలు నుండి రూ.50000 వరకు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఋణం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అన్నారు. వడ్డీ వ్యాపారుల చెర నుంచి చిరు వ్యాపారులను రక్షించడం. తాడిపత్రి టౌన్ బ్యాంక్ ద్వారా ఈ రుణాలు అందజేస్తారు. బయట అధిక వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడేవారికి కేవలం 1.15% వడ్డీకే రుణం ఇప్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.రైతులు గాని గోల్డ్ ఋణం తీసుకునే సదుపాయం ఉంది అన్నారు వడ్డీ కేవలం 8.4% మాత్రమే 6 నెలల వరకు తర్వాత 2% పెరుగుతుంది అన్నారు. మరికొంత మంది ఒకవ్యక్తికి 10 తోపుడు బండ్లు ఉంటాయి అవి తీసుకొని రోజంతా కష్టపడి పండ్లు గానీ కూరగాయలు గాని అమ్ముకొని వస్తే వారికీ ఓనర్ ?300 రూపాయలు ఇస్తాడు అ పరిస్థితి ఇప్పుడు మీకు అవసరం లేదు తోపుడు బండ్లకు కూడా బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తాము.దయచేసి పెట్టుబడి కోసం ఇబ్బంది పడే చిన్న చిన్న వ్యాపారస్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని బయట ఎక్కువ వడ్డీలు కడుతూ ఇబ్బందులు పడకండి మీకోసమే ఈ నిర్ణయం మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.(కూరగాయల విక్రేతలు, తోపుడు బండ్ల వారు, చిన్న దుకాణదారులు) ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# అకటా! పాపాగ్ని నది గర్భంలో డంపింగ్ యార్డ్!

- దరిద్ర కేంద్రంగా మారిన సంపద కేంద్రం
- స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కేవలం మాటల్లోనే
- ఆచరణలో మురికి భారత్, మురికాంధ్ర,మురికి వేంపల్లి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** ప్రధాని పదేపదే స్వచ్ఛభారత్ అంటుంటారు.ముఖ్యమంత్రి పదేపదే స్వచ్ఛాంధ్ర అంటుంటారు. కానీ ఆచరణలో మాత్రం మురికి భారత్, మురికి ఆంధ్ర మురికి వేంపల్లిగా తయారయ్యాయని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శు క్రవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లి మేజర్ గ్రామపంచాయతీ ప్రక్కన ఉన్న పాపాగ్ని నదీ గర్భంలో గ్రామపంచాయతీ సిబ్బంది వేసిన డంపింగ్ యార్డ్ గుట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే వేంపల్లి గ్రామపంచాయతీ అతిపెద్ద మేజర్గ్రామ పంచాయతీ అని,దాదాపు 50 వేల మంది జనాభా ఉంటారని అన్నారు.గత మూడు నెలలుగా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వని కారణంగా వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వ హించడం లేదు. పర్యవసానంగా వేంపల్లి గ్రామపంచాయతీ మురికి కూపంగా తయారైంది. డ్రైనేజీ కాలువలు ప్లాస్టిక్ వస్తువులతో, చెత్తాచెదారంతో నిండిపోయాయి. కొన్నిచోట్ల మురికి కుంటలుగా తయారైనాయి.రోడ్లమీద ఎక్కడ చూసినా మురికి దిబ్బలు దర్శనమిస్తాయి. పందులు, కుక్కలు, ఆవులు,ఈగలు, దోమలతో ప్రజలు సహజీవనం చేస్తున్నారు.డెంగు, మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధులు విజృంభిస్తు న్నాయి. గ్రామంలో ఉన్న సంపద కేంద్రం ఉపయోగంలో లేదు.సంపద కేంద్రం దరిద్ర కేంద్రంగా దర్శనమిస్తోంది. గత కాంగ్రెస్ పాలనలోనే డంపింగ్ యార్డ్ కోసం పాములూరు గుట్టమీద స్థలాన్ని కేటాయించడం జరిగింది. కానీ పంచాయతీ సిబ్బంది దాన్ని ఉపయోగించుకోవడం లేదు.అప్పుడప్పుడు పనిచేసే పారిశుద్ధ్య సిబ్బంది పంచాయతీ చెత్తాచెదారాన్ని, మురికిని ట్రాక్టర్లో తీసుకువచ్చి పాపాగ్ని నదీ గర్భంలో వదులుతున్నారు.దీని కారణంగా పాపాగ్ని నదీ గర్భంలో చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది.వర్షం వచ్చి నదిలో నీరు ప్రవహిస్తే మొత్తం నది కలుషితమై నదీ పరివాహక ప్రజలు అంటువ్యాధులతో అనారోగ్యానికి గురవుతారు.కాబట్టి వెంటనే పారిశుద్ధ్య సిబ్బందికి పెండింగ్ బకాయిలు చెల్లించాలని, డంపింగ్ యార్డ్ గా పాములూరు గుట్టమీద కేటాయించిన స్థలాన్ని ఉపయోగించుకోవాలని, నదీ గర్భంలో డంపింగ్ యార్డ్ వద్దని, సంపద కేంద్రాన్ని వెంటనే అమలులోకి తేవాలని కాంగ్రెస్ నాయకులు పంచాయతీ అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ కార్యాల యంలో డిడివో వెంకటసుబ్బయ్యను,ఈవో నాగభూషణ్ రెడ్డిని కలిసి వేంపల్లి గ్రామపంచాయతీ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, చక్రాయ పేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనే యరెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, వేమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలు తప్పిదాలు

# సామాన్య ప్రజలపై భారం

## -కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.రెడ్డి సాహెబ్



**రాయచోటి– సూర్య వాస్తవం:** 5 రాష్ట్రాల ఎన్నికలు అయ్యాయో లేదో బీజేపీ అసలు రంగు బయట పెట్టిందని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ అన్నారు. శుక్రవారం ఆంధ్రపత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెట్రోల్ రూ.3.14, డీజిల్ రూ.3.11 రూపాయల పెంచి తన దాహన్నీ తీర్చుకుందని, ఇంతటితో ఆగేటట్లు లేరని ఇది బీజేపీ చేతగాని పాలనకు, దివాళా కోరుతనానికి నిదర్శనం అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, తప్పిదాలు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపే విధంగా ఉన్నాయని విమర్శలు గుప్పించారు. ఇటీవల తెలంగాణ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 10 పొదుపు సూత్రాలు సూచించడాన్ని తనకు తప్ప మిగిలిన వారికేనా అంటూ ఎద్దేవా చేశారు. భారతదేశ చరిత్రలోనే ఇంతవరకు ఏ ప్రధాని ఇలాంటి సూచనలు చేయలేదని ఆ అవసరం కూడా వారికి రాలేదని ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం పరిపాలన తీరు దేశ ఆర్థిక వ్యవస్థ పై పడిందని, దాని నుంచి బయటపడడానికి దిక్కుతోచని పరిస్థితిలో ప్రజలకు ఇలాంటి సలహాలు సూచనలు ఇస్తున్నారని ఇది భారత ప్రధానమంత్రికి బాధ్యతా రాహిత్యం అని ఇది ఇలాగే కొనసాగితే రాబోవు రోజుల్లో భారత ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని పేద మధ్యతరగతి వర్గాలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని సూచించిన వెంటనే రూ.3 రూపాయలు మేర పెంచడాన్ని తప్ప పట్టారు. పెట్రోలు, డీజిల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు, విద్యుత్ వినియోగం పైన సూచ నలు చేయడం కేవలం ఆదానికి దోచిపెట్టడానికే అని ఆరోపించారు. వంటనూనెలు పరిమితంగా వాడాలని చెప్పడం వారి చేతగాని పతనానికి నిదర్శనం అన్నారు. ప్రజలు ఏమీ తిని బ్రతకాలని నిలదీశారు. మరోవైపు ఏడాది పాటు బంగారు కొనుగోలు వద్దని చెప్పడం, విడ్డూరంగా ఉందని, ఆ రంగాలలో పనిచేసే వ్యాపా రస్తులు కార్మికులు ఎలా జీవించాలని, పేద, మధ్య తరగతి ప్రజలు ఇండ్లలో పెళ్ళిళ్ళు, ఇతర శుభకార్యాలు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. వారి ఇండ్లలో శుభాకార్యాలు జరగడం కూడా ఇష్టం లేని విధంగా దిగుమతి సుంకం పెంచి బంగారు, వెండి ధర పెరుగుదల కారణం అయ్యారని విమర్శించారు. విదేశీ పర్యటనలు మానుకొని స్వదేశంలో మాత్రమే ప్రజలు తిరగాలని సూచించిన ప్రధానమంత్రి మీరు మరుసటి రోజే 5 దేశాల పర్యాటనలకు వెళ్ళడం ఆదర్శప్రాయం అన్నారు. ఇంకా వర్క్ ఫ్రం హోమ్, జీవనశైలి మార్చుకోవాలని సూచించడం ప్రజలకేనా, మీకు లేదా అన్నారు. రసాయన ఎరువులు వాడకం వద్దు, సేంద్రీయ ఎరువులు వాడాలని చెప్పే మీరు ఆదిశగా చేసిన చర్యలు ఏమిటని ప్రశ్నించారు. సామన్య ప్రజలపై పెట్రోలు డీజిల్ భారం అధికంగా వుంటుందని, దానిని ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన పలు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టాడానికే తప్ప సామాన్య ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని అన్నారు. దేశ ప్రజలందరికీ అర్థమవు తుందని, ప్రజల గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో మీకు సరైన సమాధానం చెబుతారని ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ అన్నారు.

# కిషోరి వికాసంపై అవగాహన

**ఉరవకొండ – సూర్య వాస్తవం :**

పెద ముష్టూరు గ్రామంలో నిర్వహించిన "కిషోరి వికాసం" కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లోని కౌమార దశలో ఉన్న బాలబాలికల భవిష్యత్తుకు ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతో కీలకం.

**కిషోరి వికాసం – ప్రధాన లక్ష్యాలు**

ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ 11 నుండి 18 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలపై ప్రత్యేక దృష్టి. సమగ్ర అభివృద్ధి: కేవలం విద్య మాత్రమే కాకుండా, వారిలో సామాజిక అవగాహన, ఆత్మవిశ్వాసం పెంచడం. వేసవి సెలవులను వృధా చేయకుండా, భవిష్యత్తుకు ఉపయోగపడే అంశాల్లో శిక్షణ ఇవ్వడం. ఆరోగ్యం, పరిశుభ్రత: కౌమార దశలో ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులపై సరైన అవగాహన కల్పించడం. **ఆర్డిటి సంస్థ**



అనంతపురం జిల్లాలో సామాజిక సేవా రంగంలో ఆర్డిటి సంస్థకు మంచి గుర్తింపు ఉంది. ?బాలికల సమగ్ర అభివృద్ధి జరిగినప్పుడే సమాజం పురోగమిస్తుంది. ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ వివరించినట్లుగా, ఈ కార్యక్రమం ద్వారా బాలికలు తమ హక్కులను తెలుసుకోవడమే కాకుండా, చిన్న వయస్సులో ఎదురయ్యే సవాళ్లను ఉదాహరణకు బాల్య వివాహాలు, రక్తహీనత వంటివి ఎలా ఎదుర్కోవాలో నేర్చుకుంటారు.ఆత్మరక్షణ బాలికలకు తమను తాము రక్షించుకోవడానికి అవసరమైన అవగాహన.

**లీడర్షిప్ నాయకత్వ లక్షణాలను పెంపొందించడం**

సామాజిక మార్పు మూఢనమ్మకాలు, సామాజిక వివక్షపై పోరాడే చైతన్యం. వేసవి సద్వినియోగం సెలవుల్లో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం.పెద ముష్టూరు వంటి గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామీణ యువతకు కొత్త ఉత్సాహం లభిస్తుంది. ఈ శిక్షణ పొందిన బాలబాలికలు రేపటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆశిద్దాం.


# హీరో రామ్ దర్శకత్వంలో
# సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్



వీర పాత్రలో హీరో రామ్ సరికొత్త అవతారం

హీరో రామ్ పోతినేని తన కెరీర్‌లో మరో కీలక అడుగు వేయబోతున్నారు. నటుడిగా తన వైవిధ్యాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చిన రామ్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో తొలిసారి లిరిసిస్ట్‌గా మారి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాదు, గాయకుడిగానూ తన గాత్రాని వినిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు తన 23వ చిత్రంతో దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. తెలుగు సినిమాలో అరుదుగా కనిపించే ఈ జోనర్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. కొత్తగా శ్రీకారం చుట్టిన ఈ చిత్రాన్ని రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. ఈ చిత్రంతో రామ్ పోతినేని నటుడి నుంచి దర్శకులుగా మారిన ఎన్టీఆర్, కృష్ణ, పవన్ కళ్యాణ్ వంటి స్టార్స్ జాబితాలో చేరడం విశేషం. మేకర్స్ విడుదల చేసిన బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో రామ్ పోషిస్తున్న 'వీర' పాత్రను పరిచయం చేశారు. లెదర్ జాకెట్‌లో వెనుక నుంచి కనిపిస్తున్న రామ్ లుక్ డార్క్, ఇంటెన్స్, రగ్గడ్ వైబ్‌ను క్రియేట్ చేస్తోంది. అతని స్టైలిష్ వి-కట్ హెయిర్‌స్టైల్ పాత్రలోని అగ్రెసివ్ యాటిట్యూడ్‌ను ప్రతిబింబిస్తోంది. పోస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న ఎరుపు రంగు 'విఅక్షరం... 'వీర'తో పాటు తిరుగుబాటు, ఆధిపత్యానికి సంకేతంగా నిలుస్తోంది. ఇరువైపులా కనిపించే స్కైస్క్రేపర్స్ క్రైమ్‌తో నిండిన వాతావరణాన్ని సూచిస్తున్నాయి. 'ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్ అనే ట్యాగ్‌లైన్ ఒంటరితనం, మానసిక సంఘర్షణలతో నిండిన పాత్రను సూచిస్తోంది. దర్శకుడిగా రామ్ పోతినేని స్వయంగా రూపొందించిన కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓ కొత్త తరహా అనుభూతిని ఇవ్వబోతోంది. 'వీర' పాత్రలో రామ్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని అవతార్‌లో కనిపించనుండగా, పోస్టర్ నుంచే ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుండగా, ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## 'పెద్ది- పవర్ ప్లే టూర్




హీరో రామ్ చరణ్ మచ్ నటించిన రూరల్ యాక్షన్-స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా భారీ ప్రమోషన్స్‌తో చిత్రబృందం సినిమాపై హైప్‌నుమరో స్థాయికి తీసుకెళ్తోంది. ఇప్పటికే విడుదలైన రెండు హై-వోల్టేజ్ పాటలు, రెండు విభిన్న గ్లింప్సెస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ బజ్ ఏర్పడింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. జూన్ 4న గ్రాండ్ పాన్ ఇండియా రిలీజ్‌కు సిద్ధమవుతుండగా, జూన్ 3న స్పెషల్ ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు ఎప్పుడూ చూడని రీతిలో పాన్ ఇండియా ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను టీమ్ ప్రారంభించింది. 'పెద్ది పవర్‌ప్లే టూర్' ఈనెల 18న ముంబైలో గ్రాండ్ ట్రైలర్ లాంచ్‌తో ప్రారంభం కానుంది. అన్ని ప్రధాన భాషల్లో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. అలాగే ఈనెల 22న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న ఎస్ ఆర్ హెచ్, ఆర్ సి బి మ్యాచ్ సందర్భంగా చిత్రబృందం ప్రత్యేకంగా హాజరు కానుండటం ప్రధాన ఆకర్షణగా మారనుంది. అనంతరం ఈనెల 23న భోపాల్, 24న బెంగళూరు, 28న ఢిల్లీ, 30న చెన్నై, జూన్ 1న విజయనగరం, జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. అంతేకాదు, సమ్మర్ అంతా హైప్ కొనసాగించేలా మరిన్ని సర్‌ప్రైజ్‌లు కూడా సిద్ధం చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.

## లీలావతిగా కీలక పాత్ర



అభిషేక్ నామా దర్శకత్వంలో విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది. సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది ."నాగబంధందేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలస్తుందనే నమ్మకంతో ఉన్నాం అని మేకర్స్ అన్నారు.



# సూపర్‌కింగ్స్‌కు చెక్

- 7 వికెట్లతో సూపర్‌జెయింట్స్ గెలుపు
- రాణించిన మిచెల్ మార్ష్, ఆకాశ్ సింగ్
- చెన్నై 187/5, లక్నో 188/3



**లక్నో :** ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసులో చెన్నై సూపర్‌కింగ్స్ అవకాశాలను లక్నో సూపర్‌జెయింట్స్ గట్టిగా దెబ్బకొట్టింది. 188 పరుగుల లక్ష్యాన్ని మరో 20 బంతులు ఉండగానే ఛేదించిన సూపర్‌జెయింట్స్ 7 వికెట్ల తేడాతో అదిరే విజయం సాధించింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (90, 38 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. జోశ్ ఇంగ్లిశ్ (36, 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి తొలి వికెట్‌కు 135 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించిన మిచెల్ మార్ష్.. సూపర్‌జెయింట్స్ విజయాన్ని లాంఛనం చేశాడు. 21 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన మార్ష్.. సెంచరీకి పది పరుగుల దూరంలో వికెట్ కోల్పోయాడు. నాన్ స్ట్రయిక్ ఎండ్‌లో రనౌట్‌తో మార్ష్ మెరుపులకు తెరపడింది. ఇంగ్లిశ్ ఎదురుదాడి చేయటంలో వెనుకంజ వేసినా.. మార్ష్ దంచికొట్టాడు. పవర్‌ప్లేలో సూపర్‌జెయింట్స్‌ను 86/0తో బలమైన స్థితిలో నిలిపాడు. పేసర్లు, స్పిన్నర్లపై అలవోకగా బౌండరీలు బాదాడు. పిచ్ పేస్, బౌన్స్‌కు అనుకూలించినా.. మార్ష్, ఇంగ్లిశ్ సూపర్‌కింగ్స్ పేసర్లు, స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అబ్దుల్ సమద్ (7) నిరాశపరిచినా.. నికోలస్ పూరన్ (32 నాటౌట్, 17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), ముకుల్ చౌదరి (13 నాటౌట్, 10 బంతుల్లో 2 ఫోర్లు) 16.4 ఓవర్లలోనే లాంఛనం ముగించారు. అన్షుల్ కాంబోజ్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్లో నికోలస్ పూరన్ వరుసగా 4 సిక్సర్లతో చెలరేగాడు. ఆఖరు ఓవర్‌కు వరకూ వెళ్తుందనుకున్న మ్యాచ్‌ను ముందే ముగించాడు. మిచెల్ మార్ష్ సైతం అన్షుల్ కాంబోజ్ వేసిన ఓ ఓవర్లో నాలుగు సిక్సర్లు, ఓ ఫోర్‌తో ఏకంగా 28 పరుగులు పిండుకున్నాడు. ఈ సీజన్లో సూపర్‌జెయింట్స్‌కు ఇది నాల్గో విజయం కాగా, సూపర్‌కింగ్స్‌కు ఆరో ఓటమి.



-రాణించిన కార్తీక్ శర్మ

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. పిచ్ నుంచి పేసర్లకు మంచి బౌన్స్ లభించటంతో పరుగులు చేయటం కష్టమైంది. రుతురాజ్ గైక్వాడ్ (13), ఉర్విల్ పటేల్ (6), సంజు శాంసన్ (20) నిరాశపరిచారు. కార్తీక్ శర్మ (71, 42 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) బాధ్యతాయుత అర్ధ సెంచరీతో రాణించాడు. డెవాల్డ్ బ్రెవిస్ (25, 16 బంతుల్లో 2 సిక్స్‌లు), శివం దూబె (32 నాటౌట్, 16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. ప్రశాంత్ వీర్ (13 నాటౌట్) ధనాధన్ ముగింపు అందించటంలో నిరాశపరిచాడు. సూపర్‌జెయింట్స్ పేసర్ ఆకాశ్ సింగ్ (3/26) మూడు వికెట్ల ప్రదర్శనతో సూపర్‌కింగ్స్‌ను కట్టడి చేశాడు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ : 187/5 (కార్తీక్ శర్మ 71, శివం దూబె 32, బ్రెవిస్ 25, ఆకాశ్ సింగ్ 3/26, మహ్మద్ షమి 1/41)

లక్నో సూపర్‌జెయింట్స్ : 188/3 (మిచెల్ మార్ష్ 90, జోశ్ ఇంగ్లిశ్ 36, నికోలస్ పూరన్ 32, ముకేశ్ చౌదరి 1/24, స్పెన్సర్ జాన్సన్ 1/39)

## పంచ్‌కు 17 మెడల్స్


**- ఆసియా అండర్-17 బాక్సింగ్ పోటీలు**



తాష్కెంట్ (ఉబ్బెకిస్తాన్) : ఆసియా అండర్15, అండర్17 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌ను టీమ్ ఇండియా ఘనంగా ముగించింది. రెండు వయో విభాగాల్లో బాలురు, బాలికలు ఏకంగా 17 పతకాలు సాధించారు. ఇందులో రెండు పసిడి, ఏడు రజత, ఎనిమిది కాంస్య పతకాలు ఉన్నాయి. అండర్-17 బాలికలు 12 పతకాలు అందుకున్నారు. అండర్-17 బాయ్స్ ఐదు పతకాలు సాధించారు. బాలికల 46 కేజీల విభాగంలో రాఖి పసిడి పతకం సాధించగా, 57 కేజీల విభాగంలో నవ్య సైతం స్వర్ణం అందుకుంది. ఖుషి చంద్ (48కేజీలు), దివ్య (63 కేజీలు), హిమాన్షి (70 కేజీలు), జ్యోతి (75 కేజీలు), వాన్షిక (80 కేజీలు)లు రాణించారు.

## సెమీస్ కు సాత్విక్-చిరాగ్

**- సింగిల్స్ లో ఓడిన సింధు, లక్ష్యసేన్ థాయ్ లాండ్ ఓపెన్**




బ్యాంకాక్: థాయ్ లాండ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి భారత పురుషుల జంట చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ ప్రవేశించగా.. సింగిల్స్ లో పివి సింధు, లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ 21-12, 21-13తో వరుససెట్లలో టకుమి నొమురా-యుచీ షిమోగామి(జపాన్) జంటను ఓడించారు. ఇక 6వ సీడ్ సింధు మూడు సెట్ల హోరాహోరీ పోరులో టాప్ సీడ్, జపాన్ కు చెందిన యమగుచి చేతిలో పోరాడి ఓడింది. తొలి గేమ్ ను సింధు 21-19తో తొలి గేమ్ గెలిచినా.. ఆ తర్వాత రెండు గేమ్ లను 18-21, 15-21తో చేజార్చుకొని పరాజయం పాలైంది. ఇక పురుషుల సింగిల్స్ లో లక్ష్యసేన్ 19-21, 16-21తో 2వ సీడ్, థాయ్ లాండ్ కు చెందిన విదిత్ శరణ్ చేతిలో పోరాడి ఓడాడు. దీంతో ఈ టోర్నీలో భారత పురుషుల డబుల్స్ జోడీ ఒక్కటి మాత్రమే ప్రవేశించింది.

# పేదల పెన్నిధిగా నిలుస్తున్న సీఎం సహాయ నిధి

- వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం భరోసా
- 80 మంది లబ్ధిదారులకు రూ.44.30 లక్షల చెక్కుల పంపిణీ
- 507 మందికి ఇప్పటికే రూ.4.85 కోట్ల సహాయం అందజేత
- ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తోడుంటుంది
- పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం
- ప్రతి ఆపదలో ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తంగా మారిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ జీవన భరోసానిస్తూ, వారి కుటుంబాల్లో ఆశాకిరణాలను నింపుతోందని పేర్కొన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట పట్టణంలోని సత్యసాయి కళ్యాణ మండపంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ చేతుల మీదుగా 80 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.44,30,945 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పేద కుటుంబాల్లో ఎవరికైనా అనారోగ్యం సంభవిస్తే చికిత్స ఖర్చుల భారంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, అలాంటి సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ వారికి గొప్ప అండగా నిలుస్తోందన్నారు. డబ్బుల్లేక వైద్యం ఆగిపోకూడదనే సంకల్పంతో ప్రభుత్వం మానవతా దృక్పథంతో సహాయం అందిస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ ఆర్థిక సాయం అందించి వారి ప్రాణాలను కాపాడేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 507 మంది లబ్ధిదారులకు సుమారు రూ.4.85 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేసిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని, కష్టకాలంలో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆర్థిక సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. వైద్య ఖర్చుల భారం తగ్గడంతో కుటుంబ సభ్యుల్లో కొత్త ఆశలు చిగురించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదు....

- వాస్తవాలు మాట్లాడితే కోపమెందుకు?
- మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి నిద్ర వ్యవస్థ మానుకో?
- పట్టపగలే రైతుల కడుపు కొట్టి డబ్బులు వసూలు చేయడం దారుణం
- విచ్చలవిడిగా రైతులతో జకాతి వసూలు చేయడం దుర్మార్గపు చర్య... కాపు రామచంద్రారెడ్డి



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులకు నేను వ్యతిరేకం కాదని ప్రజలకు అన్యాయం జరిగితే మాత్రం సహించేది లేదని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి మీడియా సమావేశంలో హెచ్చరించారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ :: గత కొద్ది రోజుల నుండి పట్టణంలో రైతులు పండించిన పంటలను అమ్మకోవడానికి పట్టణానికి వస్తే విచ్చలవిడిగా రైతుల నుండి సొమ్ము వసూలు చేసి అడ్డదారులు ఎంచుకుంటున్న కొంతమంది వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ప్రజలకు అన్యాయం జరిగితే సహించే గుణం నాకు లేదని ప్రజలకు భరోసా కలిగించడమే నా బాధ్యత అన్నారు. నిజం మాట్లాడితే ఎందుకు అంత ఉలుకు అని ఆయన మండిపడ్డారు. పట్టణంలో ప్రతి వారం రైతులు మార్కెట్లో కూరగాయలను అమ్ముకోవడానికి వస్తే ?3 వసూలు చేయవలసిన చోట పది రూపాయలు, తోపుడు బండ్ల దారులతో, కూరగాయల సంచితి ఐదు రూపాయలు తీసుకోవలసిన ఉండగా 30 రూపాయలు తీసుకోవడం,వసూలు చేస్తున్నారని, ఆయన మండిపడ్డారు. అన్నదాత పండించిన కూరగాయలను రైతే మార్కెట్లోకి వచ్చి అమ్ముకోవడానికి వస్తే రైతుల కడుపు కొట్టి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నాడు. రైతులతో మార్కెట్లో డబ్బులు వసూలు చేసిన రసీదులు కూడా ఇవ్వకుండా, వ్యవహరిస్తున్నప్పటికీ మున్సిపల్ కమిషనర్ నిద్ర వ్యవస్థ మానుకొని రైతులకు అండగా నిలబడాలని కాపు రామచంద్రారెడ్డి హితావు పలికారు.మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి రాష్ట్ర కూటమి ప్రభుత్వా ఆదాయానికి గండి కొట్టడం నిజం కాదా? అని కాపు రామచంద్రారెడ్డి విమర్శలు గుప్పించారు. నియోజ కవర్గము నుండి మాలమూల గ్రామాల నుండి రైతులు పండించిన పంటలను మార్కెట్కు తీసుకువచ్చిన అమ్ముకోవడానికి వీలు లేదని సుంకం విధించడం ఎంతవరకు న్యాయమని మండిపడ్డారు. అంతవరకు అర్ధరాత్రి రెండు గంటల తర్వాతనే రైతులు కూరగాయలు అమ్ముకోవాలని నిబంధనలు విధించారన్నారు. మాలములు గ్రామాల నుండి మహిళలు వచ్చిన అసభ్యకరంగా మహిళలపై మాట్లాడి దౌర్జన్యాలకు పాల్పడుతున్న అధికారి మాత్రం చూసి చూడట్లు వ్యవహరించడం బాధాకరమైన విషయం అన్నారు. రైతుల నుండి వసూలు చేయడానికి నిత్యం మద్యం సేవించిన వ్యక్తులను పెట్టుకొని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. రాయదుర్గం కూరగాయల మార్కెట్లో రౌడీల రాజ్యం జరుగుతుందన్నారు. అన్యాయాన్ని అడ్డగిస్తే వారు పండించిన కూరగాయలను రోడ్లపై వేస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కనుసందుల్లో ఈ అక్రమ దందా, అరాచకాలు, మహిళలపై అసభ్యకరమైన పదజాలాలు జరుగు తున్నాయని ఆయన కమిషనర్ పై మండిపడ్డారు. రైతులు సమస్యను పరిష్కరించేందుకు మార్కెట్లోకి నేను వెళ్లిన మద్యం సేవించిన వాళ్ళతో మమ్మల్ని తిట్టిచ్చారన్నారు. రైతుల కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమని కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇకపై అతిగా వసూలు చేసి రైతుల కడుపు కొట్టితే మాత్రం ఎవరిని సహించేది లేదని చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఎంతటి వరకైనా ప్రయాణిస్తానని కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. అరాచకాలకు పాల్పడే వ్యక్తులను అడ్డగిస్తే నాపై నిందలు వేస్తూ నిజం మాట్లాడితే అవాస్తవాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతులు కడుపు కొట్టి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న జాగాతిదారులను కమిషనర్, అధికారులు, అడ్డగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా జనతా వారధి అనే కార్యక్రమంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు.

# జనగణనలో ఖచ్చితత్వం పాటించాలి

- విద్యాశాఖ అధికారి ఆదేశాలు



**మడకశిర – సూర్య వాస్తవం :** మడకశిర ప్రాంతంలోని రొళ్ల మండలం, రంగనపల్లి మరియు దొడ్డేరి గ్రామాల్లో జరుగుతున్న జనగణన చాలా స్పష్టంగా ఉంది. ఈ వివరాలను బట్టి క్షేత్రస్థాయిలో అధికారులు ?ప్రస్తుతం ఇళ్లు, ఇతర నివాస భవనాల గణన ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇది జనగణనలో అత్యంత కీలకమైన దశ. జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా, ప్రతి నివాసాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ స్వయంగా రంగనపల్లి, దొడ్డేరి గ్రామాల్లో పర్యటించి, డేటా నమోదు తీరును పర్యవేక్షించారు. గడువు ఈ నెల 20వ తేదీలోపు 100% గణన ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### జనగణన ప్రక్రియలో కీలక దశలు

సాధారణంగా జనగణనలో డేటా సేకరణ ఇలా సాగుతుంది. గృహాల జాబితా నివాస గృహాలు, వాటి పరిస్థితి, అందుబాటులో ఉన్న వసతుల వివరాల సేకరణ. జనాభా గణన ప్రతి వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత వివరాలు, విద్య, వృత్తి మరియు ఇతర సామాజిక అంశాల నమోదు. జనగణన అనేది దేశాభివృద్ధికి, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు పునాది వంటిది. అందుకే అధికారులు 100% నమోదు కోసం ఇంతగా కృషి చేస్తున్నారు. ?ఈ ప్రక్రియ సజావుగా సాగాలంటే ప్రజలు కూడా అధికారులకు సహకరించి, సరైన సమాచారాన్ని అందించడం ఎంతో ముఖ్యం.

# మార్కాపురం వెంకటేశ్వర్లు (చిట్టిఅన్న) ఇక లేరు





**రాయచోటి–సూర్య వాస్తవం:**

రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ మోస్ట్ నాయకుడు, అందరివాడు సుగవాసి కుటుంబానికి అత్యంత ఆప్తుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు, సీనియర్ ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు,శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ మాజీ చైర్మన్ మార్కాపురం వెంకటేశ్వర్లు (చిట్టి అన్న) గురువారం రాత్రి స్వర్గస్థులైనారు. చిట్టి మరణ వార్త తెలుసుకున్న టిడిపి శ్రేణులు, కళాకారులు జీవించు కోలేక పోయారు. చిట్టి అన్న కుటుంబానికి రాజకీయ నాయకులు, కళాకారులు ప్రాగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీడీపి మినీ మహా నాడులో పాల్గొనేందుకు కువైట్‌కు వెళ్లి అక్కడ కార్యక్రమంలో ఉన్న రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు సుగువాస ప్రసాద్ బాబు విషయం తెలుసుకున్న వెంటనే తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, సుగవాసి అభిమానులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై చిట్టి అన్నకు తగిన గౌరవంతో చివరి వీడ్కోలు పలకాలని మనస్ఫూర్తిగా కోరుతూ చిట్టి అన్న పవిత్రా త్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# “పెట్రోలు కొనలేం.. ఇక మాకు సైకిలే దిక్కు”

- వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ.. సైకిల్ తొక్కుతూ

### వినూత్న నిరసన తెలిపిన సిపిఎంనేతలు

**తిరుపతి– సూర్య వాస్తవం:**

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నేడు శుక్రవారం సాయంత్రం సిపిఎం కార్యాలయం నుంచి సుందరయ్య నగర్ సర్కిల్ వరకు వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెరుగుతున్న ఇంధన ధరలతో ఇక వాహనానికి పెట్రోలు కొనలేని పరిస్థితి వచ్చిందని, సామాన్యుడు బండి నడపడం భారంగా మారిందని తెలియజేస్తూ వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ, మరోవైపు సైకిల్ తొక్కుతూ నిరసన తెలిపారు. “పెట్రోలు కొనలేం.. బండి నడపలేం”, “ఇక మాకు సైకిలే దిక్కు”, “ధరలు తగ్గించాలి” అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా ప్రజలపై భారాలు పెంచుతోందని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. రైతులు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, కార్మికులపై ఈ భారం తీవ్రంగా పడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, ఎస్. జై చంద్ర, ఆర్. లక్ష్మి, పి. బుజ్జి, ఎం. నరేంద్ర, ఆర్. మల్లికార్జునరావు, రామకృష్ణ, ఎండి. శ్రీనివాసులు, మోహన్ రావు, కేశవులు, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )